బలగం TV
BALAGAM
నిజమే మా బలం.. ప్రజలే మా బలగం
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ శుక్రవారం 20 సెప్టెంబర్ 2024 | www.balagamtv.com | పేజీలు 4



## కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి తుమ్మల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రానికి సంబంధించిన పలు అంశాల పరిష్కారానికి చొరవ చూపాలని కేంద్ర మంత్రులను రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కోరారు. గురువారం ఆయన ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌తో సమావేశమై కోకోనట్ బోర్డు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే, పామాయిల్‌పై 28శాతం దిగుమతి సుంకం విధించి, దేశీయంగా ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహిస్తుండడంపై కృతజ్ఞతలు తెలిపారు. అయితే, ఆయిల్‌పామ్‌కు కేంద్రం కనీస మద్దతు ధర

మిగితా 2వ పేజీలో

# స్కిల్ యూనివర్సిటీకి

# రూ.100 కోట్ల నిధులు

- కార్పస్ ఫండ్ ఏర్పాటుకు కార్పొరేట్లు ముందుకు రావాలి
- సీఎం రేవంత్ రెడ్డి
- సచివాలయంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు సమావేశం




బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో తెలంగాణ సర్కారు ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేస్తున్న యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. స్కిల్స్ యూనివర్సిటీ నిర్వహణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తరపున రూ. 100 కోట్ల నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. సచివాలయంలో సీఎం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ బోర్డు సమావేశం జరిగింది.ఈ సమావేశంలో యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా, మంత్రి శ్రీధర్ బాబు, కో–చైర్మన్ శ్రీనిరాజు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, వివిధ రంగాల పారిశ్రామికవేత్తలు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీకి సంబంధించిన కీలక అంశాలను పారిశ్రామికవేత్తలకు అధికారులు వివరించారు.

ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీని దేశంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. ఆ బాధ్యతను యూనివర్సిటీ బోర్డుకు అప్పగిస్తున్నట్లు ప్రకటించారు. యూనివర్సిటీకి 150 ఎకరాల స్థలంతో పాటు ప్రభుత్వం రూ. 100 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన స్కిల్ యూనివర్సిటీకి రాష్ట్రంలోని పారిశ్రామికవేత్తలు, ప్రముఖ కంపెనీలు భాగస్వామ్యం కావాలని కోరారు.

స్కిల్స్ యూనివర్సిటీ పూర్తి స్థాయి నిర్వహణ కోసం కార్పస్ ఫండ్ ఏర్పాటుకు కార్పొరేట్లు ముందుకు రావాలని ఆయన కోరారు. ప్రతి ఒక్కరూ తమకు తోచిన విధంగా యూనివర్సిటీకి సహాయం అందించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ నుంచి ప్రపంచ స్థాయిలో నైపుణ్యాలు కలిగిన యువతను అందించాలన్న తన ఆలోచనను వివరించారు.

సీఎం రేవంత్ రెడ్డి ప్రతిపాదనను తెలంగాణ యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ చైర్మన్ ఆనంద్ మహీంద్రా స్వాగతించారు. తెలంగాణ యువతకు నైపుణ్యాలు అందించాలన్న ఈ మహత్తర ఆలోచనను నేరవేర్చడంలో భాగస్వామ్యం అవ్వడం గర్వంగా ఉంది అన్నారు. అలాగే, సీఎం రేవంత్ రెడ్డి గొప్ప విజన్ ఉన్న నాయకుడని కొనియాడారు. ఆయన విజన్‌ను నమ్మి, యూనివర్సిటీ బోర్డు చైర్మన్ పదవిని సంతోషంగా స్వీకరించాను అని తెలిపారు. ఈ సమావేశంలో ఈ ఏడాదిలో ప్రారంభించనున్న పలు కోర్సుల వివరాలను పారిశ్రామికవేత్తలకు వివరించారు. ఈ సమావేశంలో పాల్గొన్న పరిశ్రమ ప్రతినిధులు యూనివర్సిటీ అభివృద్ధి పట్ల పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.

స్కిల్ యూనివర్సిటీకి సంబంధించి ఆలోచన, ఆశయాలతో పాటు పలు కీలక అంశాలను మంత్రి శ్రీధర్ బాబు సమావేశంలో వివరించారు. యూనివర్సిటీలో కోర్సులు ఈ ఏడాది నుంచే ప్రారంభించాలని యూనివర్సిటీ బోర్డు నిర్ణయించింది. దసరా పండుగ తర్వాత అక్టోబర్ నెలలో కోర్సులను ప్రారంభించనున్నట్లు సూచన ప్రాయంగా వెల్లడించింది. .

# బీహార్‌లో దారుణం

## 20 ఇండ్లకు నిప్పు పెట్టిన దుండగులు



బలగం టీవీ, పాట్నా

అల్లరి మూకలు రెచ్చిపోయాయి. దళితుల ఇళ్లలోకి చొరబడి వారిని కొట్టారు. 20కు పైగా దళితుల ఇళ్లకు నిప్పుపెట్టారు. అగంతకులు తుపాకులతో గాల్లోకి కాల్పులు జరిపినట్లు బాధిత దళిత కుటుంబాలు ఆరోపించాయి. ఈ సంఘటనపై పోలీసులు వెంటనే చర్యలు చేపట్టారు. ప్రధాన నిందితుడితో సహా 15 మందిని అరెస్టు చేశారు. బీహార్‌లోని నవాడా జిల్లాలో ఈ సంఘటన జరిగింది.

దళితులు నివసిస్తున్న భూమిపై వివాదం ఉంది. ఈ నేపథ్యంలో బుధవారం రాత్రి కొందరు వ్యక్తులు ఆ ప్రాంతానికి వెళ్లారు. దళితుల ఇళ్లలోకి చొరబడ్డారు. దళిత కుటుంబాలపై దాడులు చేశారు. వారి ఇళ్లకు నిప్పుపెట్టారు. ఆ వ్యక్తులు గాల్లోకి కాల్పులు జరిపారని బాధిత కుటుంబాలు ఆరోపించాయి. కాగా, ఈ విషయం తెలిసిన వెంటనే పోలీసులు, ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మంటలను ఆర్పివేశారు. 21 దళితుల ఇళ్లు మంటలకు కాలిపోయినట్లు పోలీసులు తెలిపారు. అయితే గాల్లోకి కాల్పులు జరిగాయన్న ఆరోపణలను ఖండించారు. అక్కడ బుల్లెట్ షెల్స్ లభించలేదని అన్నారు. ఈ సంఘటనలో ఎవరూ గాయపడలేదని చెప్పారు. ప్రధాన నిందితుడితో సహా 15 మందిని అరెస్టు చేసినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భారీగా పోలీసులను మోహరించినట్లు వెల్లడించారు.

మరోవైపు బీహార్ సీఎం నితీశ్ కుమార్ ఈ సంఘటనపై స్పందించారు. సీనియర్ అధికారులతో గురువారం సమావేశం నిర్వహించారు. సంఘటనా స్థలాన్ని సందర్శించి దర్యాప్తును పర్యవేక్షించాలని అదనపు డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్)ను ఆదేశించారు. అలాగే మరింత దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని (సిట్)ను కూడా ఏర్పాటు చేశారు. బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని, ఎవరినీ విడిచిపెట్టబోమని ఆయన అన్నారు.



## వచ్చే నెలలో ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ ప్రారంభించాలి

- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

కొడంగల్, మధిర నియోజకవర్గం, లక్ష్మీపురం గ్రామంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పనులను వచ్చే నెలాఖరులోగా ప్రారంఎతీంచాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ పర్యవేక్షణ కోసం ఏర్పాటైన మేనేజ్‌మెంట్ కమిటీ మొదటి సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి మాట్లాడుతూ పలు సూచనలు చేశారు. పరిపాలనా అనుమతుల కోసం ప్రతిపాదనలు సమర్పించేందుకు అనుసరించాల్సిన విధానాలు, ప్రతిపాదనల ప్రక్రియకు నోడల్ విభాగం ఖరారుపై చర్చించారు.

సమీకృత రెసిడెన్షియల్ పాఠశాలల నిర్వహణ, రెసిడెన్షియల్ పాఠశాలలకు భూములు కేటాయించడంపై సమావేశంలో చర్చించారు. ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలల నిర్మాణ పురోగతిని పర్యవేక్షించేందుకు ప్రతివారం సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారు శ్రీనివాస్‌రాజు, ముఖ్య కార్యదర్శులు నవీన్ మిట్టల్, బి వెంకటేశం, సందీప్ కుమార్ సుల్తానియా, శ్రీధర్, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణభాస్కర్, ఇతర ఉన్నతాధికారులు సమావేశంలో పాల్గొన్నారు.



## రోడ్డెక్కిన ఆదర్శ పాఠశాల విద్యార్థులు

- టీచర్లను నియమించాలని డిమాండ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఆసిఫాబాద్ జిలా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల విద్యార్థులు ధర్నా చేపట్టారు. టీచర్లు లేక తాము విద్య పరంగా నష్టపోతున్నమని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల బదిలీల్లో ఆసిఫాబాద్ ఆదర్శ పాఠశాల నుండి 17 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లగా వారి స్థానంలో కేవలం ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే రావడంతో పాఠాలు చెప్పే వారులేక ఇబ్బంది పడుతున్నారు.దీంతో గురువారం విద్యార్థులు భారీ సంఖ్యలో ర్యాలీగా బయలుదేరి రహదారిపై కూర్చొని ధర్నా చేపట్టారు. వారం రోజుల నుంచి ఉపాధ్యాయులు లేక తరగతులు నిర్వహించడం లేదని పదో తరగతి విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పరీక్షలు కూడా వస్తున్న తరుణంలో తమకు పాఠాలు చెప్పనిదే పరీక్షల్లో ఏమి రాయాలని తమ గోడును వెళ్లబోసుకున్నారు. సంబంధిత అధికారులు ఈ విషయంపై చొరవ తీసుకొని తమ భవిష్యత్తులో అంధకారంలో నెట్టకుండా త్వరగా ఉపాధ్యాయులు వచ్చేలా చేసి తమకు న్యాయం చేయాలన్నారు. దాదాపు రెండు గంటల పాటు రోడ్డుపై కూర్చొని ధర్నా చేపట్టడంతో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది.

## రాష్ట్రంలో కులగణన చేయడం ఖాయం




- మంత్రి పొన్నం ప్రభాకర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో కులగణన చేయడం ఖాయమని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. రాహుల్‌గాంధీ చెప్పిన మాటలకు అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి కులగణనకు అసెంబ్లీలో తీర్మానం చేశామని, బీసీ కమిషన్‌ను నియమించుకుని క్యాస్ట్ సెన్సస్ కోసం అవసరమైన ఏర్పాట్లను అధికారులు చేస్తున్నారని చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసిందన్నారు. పీసీసీ మహేశ్‌కుమార్ గౌడ్‌కు హైదరాబాద్ రవీంద్రభారతిలో సోషల్ జస్టిస్–క్యాస్ట్ సెన్సస్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సమావేశానికి హాజరైన మంత్రి మాట్లాడారు. కులగణన చేపట్టాలని అడిగితే రాహుల్‌గాంధీ జాతి ఏంటని బీజేపీ నేతలు దిగజారి మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కులగణనకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు అఫిడవిట్ దాఖలు చేసినా ఇదే పార్లమెంట్‌లో కులగణనకు తీర్మానం చేస్తామని రాహుల్‌గాంధీ చెప్పారన్నారు. కులగణన చేసే బాధ్యత కాంగ్రెస్ పార్టీదేన్నారు. బీజేపీ బలహీనవర్గాలకు వ్యతిరేకమైన పార్టీ అని, ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక బలహీన వర్గాలకు వ్యతిరేకంగా పని చేస్తోందని మంత్రి పొన్నం ధ్వజమెత్తారు. బలహీన వర్గాల ప్రజలు బీజేపీ అసలు స్వరూపం తెలుసుకోకపోతే రాబోయే తరాలకు నష్టం తప్పదన్నారు. ఆ పార్టీ కేంద్రంలో అధికారంలోకి వచ్చాక రాజ్యాంగం ప్రకారం బీసీలకు 27 శాతం రిజర్వేషన్లు ఉంటే క్రిమిలేయర్ పేరుతో ఇవి అమలు కాకుండా కుట్ర చేస్తోందని ఆరోపించారు.

రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు న్యాయం జరిగే విధంగానే రిజర్వేషన్లు ఉంటాయన్నారు. ఐక్యంగా ఉండి బలహీనవర్గాలు విజయం సాధించేలా కలిసి పని చేయాలని మంత్రి ప్రభాకర్ పిలుపునిచ్చారు. తనతో పాటు వీహెచ్, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ వంటి అనేక మంది కాంగ్రెస్ నాయకులు వారసత్వ రాజకీయాల నుంచి కాకుండా క్షేత్రస్థాయి రాజకీయాల నుంచి వచ్చారని, క్షేత్రస్థాయిలో పోరాటాలు చేస్తేనే రాజకీయంగా ఎదుగుతామన్నారు. నిబద్ధతతో రాజకీయాల్లో క్షపడితే ఉన్న స్థానాలకు చేరవచ్చన్నారు. రాజకీయాల్లో ఎవరూ కుర్చీ వేయరని, మన హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. రాబోయే రోజుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు పార్టీలో సరైన ప్రాధాన్యత దక్కేలా మహేశ్‌కుమార్ గౌడ్ మార్గదర్శకత్వం వహించాలని, వారి వెంట తాము ఉంటామన్నారు. మరో మంత్రి సీతక్క మాట్లాడుతూ అట్టడుగు వర్గాల నుంచి వచ్చిన వారు పదవులకు వన్నె తెస్తారని తెలిపారు. అధ్యక్షత వహించిన మాజీ ఎంపీ వీ హనుమంత రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కేంద్ర నాయకత్వంలో బలహీన వర్గాలకు చెందిన ఖర్గేను, రాష్ట్రం లో బడుగు వర్గాలకు చెందిన మహేష్ గౌడ్‌కు పార్టీ పగ్గాలు ఇచ్చిందన్నారు. ఇది సోనియా, రాహుల్ గాంధీలకు బడుగు బలహీనవర్గాల పై ఉన్న అభిమానానికి నిదర్శనం అన్నారు.

## నిర్లక్ష్యానికి గురవుతోన్న వైద్యారోగ్య రంగం

- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ రాష్ట్రంలో వైద్యారోగ్య రంగం తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని.. సరిపడా వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం.. ఉన్నచోట నిర్లక్ష్యం వహించడం కారణంగా రోగుల ప్రాణాలు బలవుతున్నాయని చెప్పారు. హుజుర్‌నగర్ ఏరియా హాస్పిటల్‌లో నవజాత శిశువు మరణానికి దారితీసిన ఘటన అమానవీయం, దురదృష్టకరమని కేటీఆర్ పేర్కొన్నారు. సీఎం రేవంత్ రెడ్డి హయాంలో వైద్య వ్యవస్థ కుప్పకూలిపోయింది అనడానికి ఇది అద్భుతమైన ఉదాహరణ అని చెప్పారు. బిడ్డను ప్రసవం చేసేందుకు గర్భిణి కడుపుపై నొక్కడం.. ఆ శిశువు మరణానికి దారి తీసిందన్నారు. వైద్య సిబ్బంది జవాబు దారీతనం ఎక్కడుంది..? అని కేటీఆర్ ప్రశ్నించారు. ఆస్పత్రి వైద్య సిబ్బందికి నోటీసులు ఇవ్వడమే కాకుండా.. కారకులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో శిశు మరణాలు విపరీతంగా



పెరిగిపోతున్నాయి. ప్రభుత్వ ఆస్పత్రులు 9 నెలల్లోనే అస్తవ్యస్తంగా మారాయి. ఇలాంటి భయానక చర్యలను ఆపడానికి ఎలాంటి చర్యలు తీసుకున్నారని కేటీఆర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు.

# పాఠశాలలకు దసరా సెలవులు



- అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు
- ప్రకటించిన తెలంగాణ సర్కార్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

ఈ ఏడాది తెలంగాణలో పాఠశాల విద్యార్థులకు దసరా సెలవులు 13 రోజులు రానున్నాయి. అక్టోబర్ 2 నుంచి 14వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. మళ్లీ అక్టోబర్ 15న పాఠశాలలు పునఃప్రారంభం కానున్నాయి. అక్టోబర్ 2న గాంధీ జయంతితో సెలువులు మొదలు కానున్నాయి. ఆ తర్వాత బతుకమ్మ, దసరా సెలవులు ఉంటాయని రాష్ట్ర విద్యాశాఖ అధికారులు వివరించారు.

మరోవైపు కొన్ని ప్రైవేట్ పాఠశాలలైతే అక్టోబర్ 1వ తేదీ నుంచి దసరా సెలవులు ఇస్తున్నట్లు ప్రకటించాయి. మళ్లీ అక్టోబర్ 15న తిరిగి పాఠశాలలు ప్రారంభమవుతాయని విద్యార్థుల తల్లిదండ్రులకు సమాచారం పంపించాయి.

ఇదిలాఉండగా.. తెలంగాణ ప్రభుత్వం మే 25న 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్‌ను రిలీజ్ చేసింది. అక్టోబర్ 2 నుంచి 14 వరకు దసరా సెలవులు, డిసెంబర్ 23 నుంచి 27 వరకు క్రిస్మస్ సెలవులు, అలాగే జనవరి 13 నుంచి 17వ తేదీ వరకు సంక్రాంతి సెలవులను ప్రకటించారు. 2025 ఏప్రిల్ 23వ తేదీ వరకు పాఠశాలలు కొనసాగనున్నాయి. ఇక 2025 ఫిబ్రవరిలో పదో తరగతి ప్రీ ఫైనల్, మార్చిలో వార్షిక పరీక్షలు నిర్వహించనున్నారు.

# తిరుపతి లడ్డూలో జంతువుల కొవ్వు





బలగం టీవీ, అమరావతి

ఏపీలో గత ప్రభుత్వం హయాంలో ఉపయోగించిన నెయ్యిలో జంతువుల కొవ్వు ఉన్నట్లు NDDB CALF ల్యాబ్ నిర్ధారించిన నివేదికలు బయటకొచ్చాయి. తిరుపతి లడ్డులో నెయ్యి విషయమై నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ల్యాబ్‌లో పరీక్షలు చేసినట్లు పేర్కొన్నారు. నెయ్యిలో చేప నూనె, పామాయిల్, గొడ్డు మాంసంలో వచ్చే పదార్థాలు కలిపినట్లు తెలుగుదేశం పార్టీ విడుదల చేసిన ల్యాబ్ నివేదికలు స్పష్టం చేస్తున్నాయి.

ఆవు నెయ్యిలో సోయాబీన్, పొద్దు తిరుగుడు, ఆలివ్, గోధుమ బీన్, మొక్కజొన్న, పత్తి గింజలతోపాటు చేప నూనె, బీఫ్ టాలో, పామాయిల్, పంది కొవ్వు కూడా ఇందులో వాడినట్లు నివేదికలో స్పష్టమైందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గుర్తింపు పొందిన NDDB CALF ల్యాబ్ ద్వారా వైఎస్సార్సీపీ బండారం బట్టబయలైందన్నారు. నెయ్యి కొనుగోళ్లలో ఎటువంటి నాణ్యత పాటించలేదని, ఆధారాలతో సహా నిరూపించారు. నాణ్యమైన నెయ్యికి రూ.వెయ్యికి పైగా ఖర్చవుతుందని, వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ.320కి నెయ్యి టెండర్లు పిలిచిందన్నారు. నలుగురికి నెయ్యి టెండర్ కాంట్రాక్టు ఇచ్చారని, నాణ్యమైన నెయ్యి రూ.320కి ఇచ్చే వారు ఎవరైనా ఉన్నారా అని ప్రశ్నించారు. లంచాల కోసం 15 వేల కిలోల నెయ్యి టెండర్ ఇచ్చారన్న ఆనం, ఆవు నెయ్యి విషయంలో ల్యాబ్ సర్టిఫికేషన్ లేదన్నారు.

నెయ్యి సర్టిఫికేషన్‌కు రూ.75 లక్షలతో ల్యాబ్ పెట్టే పరిస్థితిలో లేరా అని నిలదీశారు. నెయ్యి విషయమై నేషనల్ డెయిరీ డెవలప్‌మెంట్ బోర్డు ల్యాబ్‌లో పరీక్షలు చేసిందన్నారు. నెయ్యిలో చేప నూనె, పామాయిల్, గొడ్డు మాంసంలో వచ్చే పదార్థాలు కలిపినట్లు తేలిందన్నారు. నెయ్యిలో జంతువుల కొవ్వు కలిపినట్లు నివేదికలో వెల్లడైందని తెలిపారు.

# నేడు తెలంగాణ కేబినెట్ భేటీ



- కీలక అంశాలపై నిర్ణయం
- ఎజెండాలో హైడ్రా, ఆర్వోఆర్ చట్టం, పంట నష్టపరిహారం

బలగం టీవీ, హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర మంత్రిమండలి శుక్రవారం సమావేశం కానున్నది. సచివాలయంలో జరగనున్న క్యాబినెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకోనున్నట్టు సమాచారం. ఈ సమావేశంలో వ్యవసాయ రుణమాఫీని సంపూర్ణంగా అమలు చేయడం, పంటల బీమా, రైతు భరోసా, హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్? జారీకి ఆమోదం తెలిపే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దీంతో పాటు వివిధ అంశాలపై కీలక నిర్ణయాలు తీసుకోనున్నారు. అలాగే పంట నష్టం సాయం, కొత్త ఆర్వోఆర్ చట్టానికి ఆమోదం, కొత్తగా 200 గ్రామ పంచాయతీల ఏర్పాటు కేబినెట్ ఆమోదం తెలపనున్నట్లు సమాచారం.

ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల కారణంగా పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. పల్లెలు, పట్టణాలు అనే తేడా లేకుండా వరద తాకిడికి ప్రజలు భారీగా నష్టపోయారు. రూ.10 వేల కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే ప్రాథమికంగా అంచనా వేసింది. ఈ మేరకు వరద ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బృందం పర్యటించి నష్టాన్ని పరిశీలించింది. దీనిపై కేంద్రం నుంచి ఉదారంగా సాయం చేయాలని క్యాబినెట్ తీర్మానం చేయనుంది. పేద కుటుంబాలకు రేషన్ కార్డుల జారీలో పారదర్శకత పెంచేందుకు ప్రస్తుత విద్యార్హతలను సవరించే ప్రతిపాదనపై మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. రేషన్ కార్డులతో ఇబ్బంది లేకుండా సాధారణ ప్రజలకు ఆరోగ్యశ్రీ సేవల జారీకి ఆమోదం తెలిపినట్లు తెలిసింది. మరోవైపు తెలంగాణ రాష్ట్రంలో కుల గణనను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని హైకోర్టు ఆదేశించింది. స్థానిక సంస్థల ఎన్నికల కోసం ఈ కుల గణన నిర్వహించాలని నిర్ణయించారు. ఈ మేరకు కుల గణనకు సంబంధించిన సర్వే మార్గదర్శకాలకు మంత్రివర్గ సమావేశంలో ఆమోదం లభించనుంది.

తెలంగాణలో రూ.2 లక్షల వరకు ఉన్న పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేసింది. అయితే రూ.2 లక్షలకు పైగా రుణాలు ఇంకా మాఫీ కాలేదు. దీంతో దశలవారీగా రుణమాఫీ చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసింది. దీనికి కేబినెట్ ఆమోదం తెలపాల్సి ఉంది. రైతుబంధు బదులు పంట పెట్టుబడుల కోసం రైతు భరోసాను ప్రవేశపెడతారు. అమలు, పరిమితులపై జిల్లాల వారీగా అభిప్రాయాల సేకరణ చేపట్టనున్నారు. ప్రస్తుతం వానాకాలం పంటలు చివరి దశలో ఉన్నందున ఈ పథకాన్ని వెంటనే అమలు చేయాలని రేవంత్ ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. ఈ మేరకు పంటలు వేసిన వారికే సాయం చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే స్పష్టం చేశారు. దీనిపై మంత్రివర్గం చర్చించి నిర్ణయం తీసుకుంటుంది. కేంద్ర ప్రభుత్వ ఫసల్ బీమా యోజనను రాష్ట్రంలోనూ అమలు చేయనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సంగతి తెలిసిందే.

చెరువులు, నాలాల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రా ఇప్పటివరకు 99 జీవో ద్వారా కొనసాగుతోంది. ఈ సంస్థ ఎఫ్?టీఎల్?లో ఉన్న ఆక్రమణలను తొలగిస్తుంటే కొందరు అడ్డుకుని హైడ్రాకు కూల్చివేతల అధికారం లేదంటూ హైకోర్టును ఆశ్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైడ్రాకు చట్టబద్ధత కల్పించే ఆర్డినెన్స్? అంశంపై కేబినెట్ రేపు నిర్ణయం తీసుకోనుంది.

అలాగే విద్య, వ్యవసాయ కమీషన్లకు చట్టబద్ధత కల్పిస్తామన్నారు. వ్యవసాయ కమిషన్ చైర్మన్‌గా కోదండరెడ్డి, విద్యా కమిషన్ చైర్మన్‌గా ఆకునూరి మురళి నియామకానికి మంత్రివర్గం ఆమోదం తెలపనుంది. తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి, కోఠిలోని ఉస్మానియా మహిళా యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేర్లను కేబినెట్ ఖరారు చేయనుంది. వీటితో పాటు ఆరోగ్య బీమా, రేషన్ కార్డులు, గ్రామపంచాయతీల్లో పేదలందరికీ ఆరోగ్య బీమా కల్పించే ప్రతిపాదనపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకోనుంది. సీఎంఆర్ఎఫ్ నిధుల భారీ వ్యయాన్ని తగ్గించేందుకు ఈ నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం భావిస్తోంది. మరోవైపు కేబినెట్ భేటీపై విపక్షాలు విమర్శలు గుప్పిస్తుండగా.. హామీల అమలుపై చర్చ జరగనుంది. వర్షాకాలం ముగుస్తున్న దృష్ట్యా రైతు భరోసా పథకం అమలుపై కూడా మంత్రివర్గంలో చర్చించే అవకాశం ఉంది. మంత్రి మండలి సమావేశం అనంతరం తీసుకున్న నిర్ణయాలపై పూర్తి స్పష్టత రానుంది.

## మిషన్ భగీరథలో రూ. 20 వేల కోట్ల అవినీతి



- ప్రతి ఇంటికి మంచినీరు ఇస్తాం
- రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్

మిషన్ భగీరథలో భారీ అవినీతి, అక్రమాలు జరిగాయని, 46 వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులో 15 వేల నుండి 20 వేల కోట్ల రూపాయల అవినీతి జరిగిందని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ఆరోపించారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే మిషన్ భగీరథపై సర్వే నిర్వహించగా 53 శాతం ఇండ్లకు మంచినీరు అందడం లేదన్న భయంకరమైన విషయం వెలుగు చూసిందని వెల్లడించారు. గురువారం వరంగల్ జిల్లా నర్సంపేటలో ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తో కలిసి ప్రభుత్వ మెడికల్ కాలేజీని ప్రాంభించారు. ఈ సందర్భంగా మంత్రి రాట్లాడుతూ మిషన్ భగీరథ కార్యక్రమాన్ని ప్రజలకోసం చేసినట్టుగా లేదని, వారి జేబులు నింపుకోవడానికి చేసినట్టుగా ఉందని విమర్శించారు. వాస్తవాలను ప్రజలకు తెలియజేసి ప్రతి గ్రామంలో ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తామని ప్రకటించారు. గత పదేండ్లలో ఎన్నడూ లేని విధంగా వ్యవసాయానికి బడ్జెట్ లో రూ.72 వేల కోట్లు కేటాయించిన ఘనత ఈ ప్రభుత్వానిదన్నారు. 27 రోజుల్లో 23 లక్షల మందికి రూ. 18 వేల కోట్ల రైతు రుణాలను రద్దు చేశామని సాంకేతిక కారణాలతో కొంతమంది రైతులకు రుణమాఫీ ప్రయోజనం అందలేదని వీలైనంత త్వరలో వాటిని పరిష్కరించి ఇచ్చిన మాట ప్రకారం అర్హులైన ప్రతి రైతన్నకు రుణమాఫీ చేస్తామని, అన్న మాట ప్రకారం 31 వేల కోట్ల రూపాయలకి ఇంకా కావాలంటే రెండు మూడు వందల కోట్లు ఎక్కువైనా పర్వాలేదు అర్హులైన ప్రతి రైతన్నకి ఈ ప్రభుత్వం చిత్తశుద్ధితో రెండు లక్షల రూపాయలు వరకు రుణమాఫీ చేసి తీరుతుందని స్పష్టం చేశారు.

అర్హులైన ప్రతి ఒక్కరికీ హెల్త్ కార్డులు, రేషన్ కార్డులు వేరు వేరుగా అందించబోతున్నామని పొంగులేటి ప్రకటించారు. మరి కొద్ది రోజుల్లో ఇందిరమ్మ ఇండ్లకు ముగ్గు వేయబోతున్నామని తెలిపారు. ఈ ప్రభుత్వం విద్యా వైద్య రంగాలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రాజెక్టుల పేరుతో మిషన్ భగీరథ పేరుతో వేల కోట్ల రూపాయలను కాజేసిన గత ప్రభుత్వ పెద్దలు తమ తప్పులు కప్పి పుచ్చుకోవడానికి ప్రతి దానిని రాద్ధాంతం చేయడం అలవాటు చేసుకున్నారని దుయ్యబట్టారు. వారి పాలనలో అవినీతి అక్రమాలు జరిగినట్టుగానే ఇప్పుడు కూడా జరుగుతున్నాయనే భ్రమలో బీఆర్ఎస్ నాయకులు జీవిస్తున్నారని ఎద్దేవా విమర్శించారు.

## 21న ఢిల్లీ సీఎంగా అతిషి ప్రమాణ స్వీకారం

- ఐదుగురు మంత్రులతో సీఎంగా అతిషి ప్రమాణం

బలగం టీవీ, హైదరాబాద్



ఢిల్లీ ముఖ్యమంత్రిగా అతిషి ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేయనున్నారు. సీఎంతో కలిపి ఐదుగురు నేతలు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. ఇందులో గోపాల్ రాయ్, కైలాష్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్ కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయబోతున్నారు. ఈ సారి కొత్తగా ముఖేష్ అహ్లావత్ సైతం కేబినెట్‌గా ప్రమాణం సైతం ప్రమాణం చేయనున్నట్లు సమాచారం. ఆయన సుల్తాన్‌పురి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. ప్రస్తుతం ఐదుగురు మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. అరవింద్ కేజ్రీవాల్ కేబినెట్‌లో మంత్రిగా కొనసాగిన అతిషి సీఎంగా నియామకయ్యారు. సీఎంతో పాటు మంత్రులు సైతం ఈ నెల 21న ప్రమాణస్వీకారం చేస్తారని ఆమ్ ఆద్మీ పార్టీ ఒక ప్రకటనలో తెలిపింది.

ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామాతో పాటు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు కొత్త ప్రభుత్వ ఏర్పాటు ప్రతిపాదనలు పంపిన విషయం తెలిసిందే. ఆ ప్రతిపాదనలకు రాష్ట్రపతి ఆమోదం తెలిపారు. కేజ్రీవాల్ తన రాజీనామాతో పాటు కొత్త సీఎంగా అతిషి పేరును ప్రతిపాదిస్తూ కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు ఎల్జీకి ప్రతిపాదనలు అందజేశారు. అలాగే, కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు సైతం ప్రతిపాదనలు పంపారు. రాష్ట్రపతి ఆమోదం నేపథ్యంలో శనివారం ప్రమాణస్వీకారం తేదీని ఎల్జీ స్వచ్ఛంగా నిర్ణయించారు. కేజ్రీవాల్ రాజీనామా నేపథ్యంలో సాంకేతికంగా మంత్రివర్గం మొత్తం రద్దవుతుంది. దాంతో అతిషితో పాటు మంత్రివర్గం సైతం ప్రమాణం చేయనున్నది. గోపాల్ రాయ్, కైలాష్ గెహ్లాట్, సౌరభ్ భరద్వాజ్, ఇమ్రాన్ హుస్సేన్ కేబినెట్ మంత్రులుగా ప్రమాణం చేయనున్నారు. వీరితో పాటు పలువురు ఎమ్మెల్యేలకు తొలిసారిగా కేబినెట్ బెర్తులు దక్కే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## అక్టోబర్ 2 నుంచి రేషన్‌కార్డులకు దరఖాస్తులు

బలగం టీవీ, హైదరాబాద్



రాష్ట్రంలో కొత్త రేషన్ కార్డుల జారీ కోసం ప్రజల ద్వారా అక్టోబర్ 2నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గురువారం సీఎం సచివాలయంలో కొత్త రేషన్ కార్డుల జారీకి సంబంధించిన విధి విధానాలపై పౌరసరఫరాలశాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. మంత్రి వర్గ ఉపసంఘం సభ్యులు కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఎం మాట్లాడుతూ రేషన్ కార్డుల జారీకి పటిష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని ఆదేశించారు. అర్హులందరికీ డిజిటల్ రేషన్‌కార్డులలు ఇచ్చేందుకు ప్రయత్నాలు ప్రారంభించాలన్నారు. ఈ అంశంపైన త్వరలోనే మరోసారి సమీక్ష నిర్వహించినున్నట్టు తెలిపారు. సమావేశంలో రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనరసింహతోపాటుగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, ప్రిన్సిపుల్ సెక్రటరీలు రామకృష్ణారావు, వి.శేషాద్రి , కార్యదర్శులు చంద్రశేఖర్‌రెడ్డి, సంగీత సత్యనారాయణ, రఘునందన్‌రావు, డి.ఎస్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయం చేసే వారికే రైతు బంధు

- కౌలు రైతు, భూమి ఓనర్ చర్చించుకోవాలి
- వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

బలగం టీవీ, హైదరాబాద్



వ్యవసాయం చేసే వారికే రైతు బంధు ఇవ్వాలనేది తమ ప్రభుత్వం నిర్ణయమని తెలంగాణ వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఆయన ఢిల్లీలో పలువురు కేంద్రమంత్రులను కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రపంచ ఆహార సదస్సులో తెలంగాణ స్టాల్ ఏర్పాటు చేశామన్నారు. పరిశ్రమల శాఖ మంత్రి రావాల్సిన కార్యక్రమానికి తాను హాజరయ్యానని, ఫుడ్ ప్రాసెసింగ్ పరిశ్రమ, పారిశ్రామిక విధానం గురించి వివరించి పెట్టుబడులు ఆకర్షించే ప్రయత్నం చేసినట్టు చెప్పారు. వరంగల్, ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కొత్తగూడెంలో ఎయిర్ పోర్టుల విషయంలో వేగవంతం చేయాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడును కలిసి కోరినట్టు తెలిపారు. ఖమ్మం జిల్లా వరదల గురించి శివరాజ్ సింగ్ చౌహాన్‌తో చర్చించానన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిశానని, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా సహకరించాలని కోరానని తెలిపారు.

పంట ఎవరైతే పండిస్తారో వారికే చేయూత ఇవ్వాలని, అదే సరైనదని పేర్కొన్నారు. కౌలు రైతు, భూమి ఓనర్ చర్చించుకొని ఎవరికి రైతు బంధు కావాలో వారే నిర్ణయం తీసుకోవాలని చెప్పారు. ఏపీలో ఉన్నట్లు కౌలు రైతు ఒప్పందాలు తెలంగాణలో లేవన్న మంత్రి, మన భూ చట్టాలు వేరు, ఏపీలో వేరని వివరించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 20 లక్షల రైతులకే రుణమాఫీ చేశారని, తాము మాత్రం 42 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూర్చినట్టు చెప్పారు. అది కూడా 2 లక్షల రూపాయల దాకా చేశామని తెలిపారు. రైతు క్షేమం కోసమే తమ ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. 5 ఏళ్లలో కేసీఆర్ లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని, ఒకేసారి 18 వేల కోట్ల రూపాయలు ఇచ్చి రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని పేర్కొన్నారు. ఇంకా అవసరమైన నిధులు సమకూరుస్తామని, పంట నష్టంతో రైతులు ఇబ్బందులు పడకుండా ప్రీమియం ప్రభుత్వమే కట్టి ఇన్సూరెన్స్ ఇస్తుందని స్పష్టం చేశారు.

## కేంద్ర మంత్రులను కలిసిన మంత్రి తుమ్మల

(మొదటి పేజీ తరువాయి)

కల్పించాలని, ఇటీవల వరదలతో జరిగిన నష్టానికి గాను కేంద్రం నుంచి సాయం చేయాలని కోరారు. ఆతర్వాత కేంద్ర ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి చిరాగ్ పాశ్వాన్‌ను కలిసి తెలంగాణలో ఎక్కువగా పండే పంటల ప్రాసెసింగ్‌కు యూనిట్లు మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశారు. అంతేకాకుండా కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి రామ్మోహన్‌నాయడును కలిసి రాష్ట్రంలోని కొత్తగూడెంతో పాటు పలు ప్రాంతాల్లో విమానాశ్రయాల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని లేఖ అందించారు. అలాగే, ఢిల్లీలో జరిగిన ప్రపంచ ఆహార సదస్సులో మంత్రి తుమ్మల మాట్లాడారు. ఈక్రమంలోనే ప్రఖ్యాత కంపెనీల ఎండీలను తెలంగాణలో ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుకు ఆహ్వానించారు. ఆతర్వాత డెలాయిట్ ఇండియా ఆధ్వర్యాన నిర్వహించిన 'గ్రోత్ విత్ ఇంపాక్ట్ గవర్నమెంట్' సమ్మిట్‌లో పాల్గొని 'వికసిత్ తెలంగాణ' అంశంపై ప్రసంగించారు.

## కోల్‌కతా జూడాల సమ్మె విరమణ

బలగం టీవీ, హైదరాబాద్


పశ్చిమ బెంగాల్‌లో కోల్‌కతా డాక్టర్లు సమ్మె విరమించారు. ముఖ్యమంత్రి మమత బెనర్జీతో గురువారం జరిపిన చర్చలు ఫలించినట్లు రాత్రిపూట ప్రకటన వెలువడింది. ఆర్‌జి కార్ ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యురాలిపై హత్యాచారం ఘటన కలకలానికి దారితీసింది. డాక్టర్లు విధులు బహిష్కరించి సమ్మెకు దిగారు. ఈ క్రమంలో చర్చలకు ముఖ్యమంత్రి మమత బెనర్జీ చొరవతీసుకున్నారు. విధుల సమయంలో తమకు రక్షణ లేకుండా పోయిందని, బాధితురాలికి న్యాయం తో పాటు , తమ రక్షణపై తగు లిఖితపూర్వక పత్రం ఇవ్వాలని, చర్చల రికార్డు జరగాల్సి ఉంటుందని డాక్టర్లు పట్టుపట్టారు. దీనిపై చాలారోజులుగా నెలకొన్న ప్రతిష్టంభన తరువాత ప్రభుత్వం వరుసగా ఇస్తూ వచ్చిన హామీల క్రమంలో , డాక్టర్ల భద్రతకు చర్యల ప్రకటనలతో ఇప్పుడు డాక్టర్లు సమ్మె విరమించినట్లు వెల్లడైంది.

## సీఎం సహాయ నిధికి సింగరేణి భారీ విరాళం



బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణలో వరద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి సంస్థ అధికారులు, ఉద్యోగులు ముందుకొచ్చారు. తమ ఒకరోజు బేసిక్ సాలరీ నుంచి రూ.10.25కోట్ల విరాళం ప్రకటించారు. ఈ మేరకు (గురువారం) సచివాలయం ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, సింగరేణి సీఎం బలరాం, ఇంధనశాఖ కార్యదర్శి రోనాల్డ్ రోస్ ఆధ్వర్యంలో కార్మిక సంఘాల నాయకులు సీఎం రేవంత్‌కు విరాళం చెక్కును అందజేశారు. తెలంగాణ ప్రజల కోసం ప్రభుత్వం తీసుకుంటున్న సహాయ చర్యలకు తోడ్పాటుగా ఒకరోజు వేతనాన్ని విరాళంగా ప్రకటించామన్నారు.



వరద బాధితుల సహాయార్థం సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ముఖ్యమంత్రి సహాయ నిధికి 2.50 లక్షల రూపాయల విరాళం అందించారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కలను కలిసి ఆ మేరకు చెక్కును అందజేశారు. వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వానికి అండగా సహాయం అందించినందుకు ముఖ్యమంత్రి వారిని అభినందించారు.

బలగం టీవీ, హైదరాబాద్

## జానీ మాస్టర్ అరెస్ట్

బలగం టీవీ, హైదరాబాద్



కొరియోగ్రాఫర్ జానీ మాస్టర్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. సైబరాబాద్ ఎస్‌వోటీ పోలీసు బృందం గోవాలోని లాడ్జిలో అతడిని అదుపులోకి తీసుకుంది. అక్కడి కోర్టులో హాజరు పరిచి నగరానికి తీసుకొస్తున్నారు. తనపై పలుమార్లు లైంగికదాడి చేశాడంటూ ఓ మహిళా అసిస్టెంట్ కొరియోగ్రాఫర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నార్సింగి పోలీస్ స్టేషన్‌లో ఆదివారం కేసు నమోదైంది. బాధితురాలు రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి నార్సింగికి బదిలీ చేశారు. అతడిపై పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేశారు. పోలీసులు దర్యాప్తు చేపట్టి జానీ మాస్టర్‌ను అరెస్ట్ చేశారు.

### నిజం నిరూపిస్తే నా భర్తను వదిలేస్తా : జానీ మాస్టర్ సతీమణి


తన భర్త, జానీ మాస్టర్ ప్రతిభను ప్రోత్సహించేవారని, ఎవరికైనా అవకాశాల్లేకుండా ఎందుకు చేస్తారని జానీ మాస్టర్ సతీమణి సుమలత అలియాస్ ఆయేషా అన్నారు. గురువారం ఓ మీడియాతో మాట్లాడారు. ఫిర్యాదు చేసిన మహిళ నిజం నిరూపిస్తే జానీ మాస్టర్‌ను వదిలేస్తానని తెలిపారు.

హీరోయిన్‌గా స్థిరపడాలి లేదా కొరియోగ్రాఫర్‌గా అగ్ర స్థానంలో ఉండాలనేది ఆ అమ్మాయి, ఆమె తల్లి కోరిక అని ఆయేషా తెలిపారు. స్టేజ్ షోల నుంచి వచ్చిన ఆమె, సినీ రంగాన్ని చూసి లగ్జరీ లైఫ్ కావాలని కోరుకునేదని చెప్పారు. తనకే ఎక్కువగా ప్రాముఖ్యత ఇవ్వాలని చూస్తుంటుందని పేర్కొన్నారు. మైనర్‌గా ఉన్నప్పుడే ఘటన జరిగిందనడానికి సాక్ష్యమేంటని, జానీ మాస్టర్‌తో సాన్నిహిత్యంగా ఉందని ఎవరైనా చూశారా అని ప్రశ్నించారు. ఇప్పటి వరకూ ఆ అమ్మాయి బయటకొచ్చి మాట్లాడిందా అని అన్నారు. అన్యాయం జరిగిందని ఫిర్యాదు చేసినప్పుడు మాట్లాడటానికి ఏమైందని, ఒకవేళ లైంగిక వేధింపులకు గురైతే 'జానీ మాస్టర్' వద్ద పని చేయడం తన అదృష్టమని నవ్వుతూ ఎందుకు చెబుతోందని ఆయేషా ప్రశ్నించారు. ఆ మాట చెప్పినప్పుడు ఆమె ఇబ్బంది పడినట్లు కనిపించలేదని తెలిపారు. హైదరాబాద్‌లో అసోషియేషన్ కార్డు పొందేందుకు ఆమె దగ్గర డబ్బులేకపోతే జానీ మాస్టర్‌యే ముంబయిలో ఇప్పించారని చెప్పారు. తన భర్త పని చేసిన సినిమాలో కొరియోగ్రాఫర్‌గా కూడా ఆమెకు అవకాశం ఇచ్చారని వెల్లడించారు.

## రేవంత్ రెడ్డిపై చర్యలు తీసుకోండి..

- మల్లికార్జున్ ఖర్గేకు హరీశ్‌రావు బహిరంగ లేఖ

బలగం టీవీ, హైదరాబాద్



ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు బహిరంగ లేఖ రాశారు. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై రేవంత్ రెడ్డి ఉపయోగిస్తున్న భాష గురించి లేఖలో హరీశ్‌రావు పేర్కొన్నారు. రేవంత్ రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని ఖర్గేను కోరారు. రేవంత్ రెడ్డి భాషపై కాంగ్రెస్ అధిష్టానం అభ్యంతరం చెప్పకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాహుల్ గాంధీ టెర్రరిస్ట్ అంటూ బీజేపీ చేసిన వ్యాఖ్యలను ఖండించిన కాంగ్రెస్.. కేసీఆర్‌పై రేవంత్ భాషను కట్టడి చేయకపోవడంపై హరీశ్ రావు ఆగ్రహం వెలిబుచ్చారు. రేవంత్ భాషను ప్రోత్సహిస్తున్న హైకమాండ్‌కు బీజేపీ వ్యాఖ్యలను ఖండించే నైతిక హక్కు కూడా లేదన్నారు. పోలీసులు సీఎం రేవంత్‌కు కీలుబొమ్మలుగా మారి నియంతృత్వ పాలనకు నిదర్శనంగా నిలుస్తున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ నేతలపై తప్పుడు కేసులు పెడుతున్నారు. సీఎం అనుచరులు నేరాలకు పాల్పడినా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. హామీలపై నిలదీస్తే ప్రతిపక్ష ఎమ్మెల్యేలపై దాడులు చేయిస్తున్నారు. రేవంత్ రెడ్డి తీరుపట్ల కాంగ్రెస్ అధిష్టానం మౌనం దురదృష్టకరమని... తెలంగాణలోని పరిస్థితి మహాభారతాన్ని గుర్తు చేస్తోందన్నారు.. ధృతరాష్ట్రుడు తన కొడుకు దుర్యోధనుడి క్రూరమైన అతిక్రమణలను ఉద్దేశపూర్వకంగా విస్మరించినట్టు కాంగ్రెస్ అధిష్టానం తీరు ఉందని అన్నారు.

# మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా





- స్కూల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా
- ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లలో విద్యార్థులను అడిగి తెలుసుకున్న కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- ఈఎంఆర్ ఎస్ లో మెరుగైన వసతులు కల్పిస్తాం..
- కేంద్ర మంత్రి బండి సంజయ్
- మరిమడ్లలోని విద్యాలయంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

**బలగం టీవీ , రాజన్న సిరిసిల్ల :**

మెనూ ప్రకారం భోజనం ఇస్తున్నారా, స్కూల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని విద్యార్థులను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అడిగి తెలుసుకున్నారు.ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్ళలో మెరుగైన వసతులు కల్పిస్తామని తెలిపారు. గురు వారం కోనరావుపేట మండలం మరిమడ్ల, ఎల్లారెడ్డిపేట మండలం దుమాల ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లను కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ తో కలిసి పరిశీలించారు. ముందుగా ఆర్ట్ గ్యాలరీలు ప్రారంభించారు. కోనరావుపేట మండలం మరిమడ్లలోని విద్యాలయంలో రూ. 16 లక్షల అంచనాలతో 8 టాయిలెట్స్ నిర్మాణంకు శంకుస్థాపన చేశారు. అనంతరం మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ

ప్రధాని నరేంద్రమోడీ ప్రభుత్వం గిరిజన విద్యార్థులందరికీ నాణ్యమైన విద్య, వసతి సౌకర్యాలు కల్పించేందుకు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్ ను ఏర్పాటు చేసిందని అన్నారు . ఒక్కో విద్యార్థికి సగటున రూ.1 లక్షా 9 వేలు ఖర్చు చేస్తుందని,ఇక్కడి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదేశించడంతోనే ఇక్కడికి వచ్చానని, సమస్యలన్నీ త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. 2018-19 ఆర్థిక సంవత్సరంలో ప్రతి బ్లాక్ పరిధిలో 50 శాతానికంటే ఎక్కువ గిరిజన జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ ఎం ఆర్ ఎస్ లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు అని, ఆ తరువాత 2022లో కనీసం 20 శాతం ఎస్టీ జనాభా కలిగిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయాలని సంకల్పించారని అన్నారు . ఈ నేపథ్యంలో దేశవ్యాప్తంగా 728 మంజూరు చేస్తే, ప్రస్తుతం 410 స్కూల్స్ లో విద్యాబోధన కొనసాగుతున్నదని అన్నారు.

సగటున ఒక్కో స్కూల్ లో 480 మంది విద్యార్థులు ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని, దేశవ్యాప్తంగా 1 లక్షా 26 వేల 626 మంది విద్యార్థులు చదువుతున్నారని, తెలంగాణలో 23 ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలుంటే అందులో 8309 మంది విద్యార్థులున్నారని అన్నారు.

ఒక్కో విద్యార్థిపై సగటున ఏటా 1 లక్షా 9 వేల రూపాయలు ఖర్చు చేస్తున్నారు అని అట్లాగే రెసిడెన్షియల్ భవన నిర్మాణం కోసం రూ. 37 కోట్ల 80 లక్షలు ఖర్చు చేస్తున్నారని,నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలతోపాటు ఈశాన్య రాష్ట్రాల్లోని ఏకలవ్య స్కూల్స్ భవన నిర్మాణానికి 48 కోట్ల రూపాయలు కేటాయిస్తున్నారని అన్నారు .

ఈ పాఠశాలల్లో 10 శాతం సీట్లు మాత్రమే ఇతరులకు రిజర్వేషన్ కల్పిస్తారు అని,90 శాతం సీట్లు ఎస్టీ విద్యార్థులకే, క్రీడల్లో ప్రతిభ కలిగిన ఎస్టీ విద్యార్థులకే స్పోర్ట్ కోటా కింద 20 శాతం సీట్లను కేటాయిస్తున్నారాని అన్నారు. ఈ కార్యక్రమం లో ఆర్డీఓ జాను నాయక్, డీఈఓ రమేష్ కుమార్, ప్రత్యేక అధికారులు లక్ష్మీ రాజం, భారతి, రాందాస్, ఆర్డీవోలు రాజేశ్వర్, రమేష్, డీఎస్పీ చంద్రశేఖర్ రెడ్డి, సెస్ చైర్మన్ చిక్కాల రామారావు, వైస్ చైర్మన్ తిరుపతి రెడ్డి,ప్రిన్సిపాల్ ఆర్ ఎస్ యాదవ్, మంజిత్, తహసిల్దార్లు రాం చంద్రం, విజయ ప్రకాష్ రావు, ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి, సత్తయ్య, డీఎల్ పీఓ రాజు తదితరులు పాల్గొన్నారు.







## నీళ్ళ కోసం మహిళల నిరసన

**బలగం టీవీ ,తంగళ్లపల్లి**

రాజన్న సిరిసిల్ల జిల్లా తంగళ్ళపల్లి మండలంలోని చిన్న లింగాపూర్ గ్రామ ప్రజలు తాగడానికి నీళ్ల లేవని అధికారులకు ఎన్నోసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని చిన్నలింగపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట ఖాళీ బిందెలతో మహిళలు నిరసనవ్యక్తం చేశారు. అధికారులు ఇప్పటికైనా మొరాలకించి గ్రామంలో తాగునీటి సమస్యలు తీర్చాలని కోరారు.



## సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్

**బలగం టీవీ , వేములవాడ**

సీఎంఆర్ గడువులోగా ఇవ్వాలని రైస్ మిల్లుల యజమానులను అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ ఆదేశించారు. గురువారం వేములవాడలోని పలు రైస్ మిల్లులను అదనపు కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లులో బియ్యం నాణ్యతను పరిశీలించారు. ఆయా రైస్ మిల్లులకు ధాన్యం ఎంత కేటాయించారు, ఇప్పటి వరకు సీ ఎం ఆర్ ఎంత ఇచ్చారో అడిగి తెలుసుకున్నారు. అనంతరం అదనపు కలెక్టర్ ఖీమ్యా నాయక్ మాట్లాడుతూ రైస్ మిల్లర్లు తమకు ఇచ్చిన లక్ష్యాన్ని గడువు లోగా పూర్తి చేయాలని ,ఎట్టి పరిస్థితుల్లోనూ గడువు పెంచమని స్పష్టం చేశారు. ఇక్కడ జిల్లా పౌర సరఫరాల అధికారి వసంత లక్ష్మి, డీటీ తదితరులు పాల్గొన్నారు

## ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూళ్లల్లో స్వచ్ఛత ఈ సేవ



**బలగం టీవీ ,సిరిసిల్ల:**

స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా కొనరావుపేట మండలం మరిమడ్ల గ్రామంలో ఏకలవ్య మోడల్ స్కూల్లో స్వచ్ఛ ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేశారు . ఈ గ్యాలరీలో పాఠశాల విద్యార్థులు తయారుచేసిన సింగిల్ యూస్ ప్లాస్టిక్ మరియు ప్లాస్టిక్ బాటిల్స్ తో, పేపర్ తో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. అనంతరం విద్యార్థులు చేత ప్రతిజ్ఞ నిర్వహించారు. స్వచ్ఛత ఈ సేవ కార్యక్రమంలో భాగంగా స్కూలు ఆవరణలో కేంద్ర మంత్రి బండి సంజయ్ మొక్క నాటారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ సందీప్ కుమార్ ఝా, ఎస్పీ అఖిల్ మహాజన్ తదితరులు పాల్గొన్నారు.

## రాబోయే మూడు రోజులు వర్షాలు

**బలగం టీవీ , హైదరాబాద్**

తెలంగాణలోని కొన్ని జిల్లాలో ఓ మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. రాబోయే 3 రోజులు (24వ తేదీ వరకు) తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు. ఈ నెల 21న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, నిర్మల్, మంచిర్యాల, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొన్నారు. ఈ నెల 22న ఆసిఫాబాద్, నిర్మల్, నిజామాబాద్, మంచిర్యాల, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో అక్కడక్కడ ఉరుములు, మెరుపులతో వర్షాలు కురుస్తాయని తెలిపారు. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు.అలాగే, ఈ నెల 23న ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, సూర్యాపేట, కొత్తగూడెం, మహబూబాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ అధికారులు వెల్లడించారు. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేశారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాల తిరోగమనం ప్రారంభమైందని.. ఈ సమయంలోనూ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని భారత వాతావరణ శాఖ తెలిపింది.



## 'మిస్టర్ పర్ఫెక్ట్' రీ-రిలీజ్ డేట్ ఫిక్స్




**బలగం టీవీ , హైదరాబాద్**

ప్రభాస్ కెరీర్‌లో మంచి హిట్ గా నిలిచిన 'మిస్టర్ పర్ఫెక్ట్' చిత్రాన్ని ప్రభాస్ పుట్టినరోజు కానుకగా రీ-రిలీజ్ చేయనున్నట్లు ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ వెల్లడించింది. ఈ సినిమాతో మరోసారి వింటేజ్ డార్లింగ్ ప్రభాస్‌ని చూస్తామని మేకర్స్ తెలిపారు. అక్టోబర్ 22న సినిమాను రీ-రిలీజ్ చేయనున్నట్లు తెలిపారు. రొమాంటిక్ డ్రామాగా 2011లో విడుదలైన 'మిస్టర్ పర్ఫెక్ట్' ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఈ సినిమాలో కాజల్ అగర్వాల్, తాప్సీ పన్ను హీరోయిన్లుగా నటించారు. రాక్ స్టార్ దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందించిన ఈ సినిమా పాటలు సెన్సేషనల్ హిట్ అయ్యాయి. మరి ఈ సినిమా రీరిలీజ్‌తో ఎలాంటి సంచలనం సృష్టిస్తుందో చూడాలి.

పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ రీసెంట్‌గా 'కల్కి 2898 ఏడీ మూవీతో బాక్సాఫీస్ దగ్గర సెన్సేషన్ క్రియేట్ చేశాడు. ఈ సినిమా విజయం తరువాత ఆయన ఇప్పుడు తన నెక్స్ట్ మూవీ 'ది రాజా సాబ్'తో బిజీగా ఉన్నాడు. ఇక ఈ సినిమా రిలీజ్ కాకముందే, మరో ప్రాజెక్టును కూడా ప్రభాస్ ప్రారంభించిన సంగతి తెలిసిందే.

## తెలంగాణ ఎన్నికల కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన రాణి కుముదిని

**బలగం టీవీ , హైదరాబాద్**

తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఐఏఎస్ అధికారిణి రాణి కుముదిని బాధ్యతలను స్వీకరించారు. ఆమెను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమించారు. 1988 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన రాణి కుముదిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో వివిధ హోదాలలో పని చేశారు. ఈ ఏడాది జులైలో ఆమె పదవీ విరమణ పొందారు. అనంతరం ఆమెను రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రెండు రోజుల క్రితం ఉత్తర్వులు జారీ చేసింది. ఈరోజు మాసాబ్‌ట్యాంక్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో ఎస్ఈసీగా ఆమె బాధ్యతలు చేపట్టారు. రాణి కుముదిని మూడేళ్లపాటు రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఉంటారు.



## హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలి

- ఈటల రాజేందర్



**బలగం టీవీ , హైదరాబాద్**

చెరువులు, కుంటల రక్షణ లక్ష్యంగా పని చేస్తున్న హైడ్రాకు చట్టబద్ధత కల్పించాలని మల్కాజ్‌గిరి ఎంపీ, బీజేపీ నేత ఈటల రాజేందర్ అన్నారు. జనగామ జిల్లాలో పర్యటించిన ఈటల మాట్లాడుతూ... హైడ్రాకు ఇప్పటి వరకు ఎలాంటి చట్టబద్ధత లేదన్నారు. అందుకే కేబినెట్‌లో చర్చించి హైడ్రాకు చట్టబద్ధత తీసుకు రావాలని ముఖ్యమంత్రిని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కుమ్ములాటలు ఉన్నాయని, అవి బయటపడకుండా ఉండేందుకు హైడ్రా పేరుతో డైవర్షన్ చేస్తున్నారని విమర్శించారు. హైడ్రా పేరుతో పేదల భూములు లాక్కోవడానికి రేవంత్ రెడ్డి జాగీరు కాదన్నారు. చెరువులు, వాగుల రక్షణ కోసం అవసరమైతే భూసేకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

### హైడ్రా లాంటి వ్యవస్థను తీసుకురావాలి: రఘునందన్ రావు

హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని అన్ని మున్సిపాలిటీల్లో హైడ్రా వంటి వ్యవస్థను తీసుకు రావాలని మెదక్ బీజేపీ ఎంపీ రఘునందన్ రావు అన్నారు. సంగారెడ్డిలో పర్యటించిన ఆయన మాట్లాడుతూ... జిల్లాలోని అమీన్‌పూర్‌లో ప్రైవేటు సర్వే నెంబర్ వేసి ప్రభుత్వ భూమిలో అపార్టుమెంట్ కట్టారని ఆరోపించారు. అందులో ఉంటున్న వారికి అధికారులు నోటీసులు ఇచ్చారని, కానీ అక్కడ నివసిస్తున్న వారు అమాయకులని అన్నారు. చాలామంది అమాయకులు ఇలా ఇళ్లను కొనుగోలు చేసి నష్టపోతున్నారని వాపోయారు.


ప్రభుత్వ ఆసుపత్రులపై కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై రఘునందన్ రావు మండిపడ్డారు. పదేళ్లు అధికారంలో ఉండి ఏమీ చేయని వారు ఇప్పుడు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక సంఘటనను చూపి కొత్త ప్రభుత్వంలో ఒకేసారి మార్పు జరగాలని కోరుకోవడం సరికాదన్నారు. తాము కాంగ్రెస్ పార్టీకి వత్తాసు పలకడం లేదని, సద్విమర్శలు ఉండాలన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఆసుపత్రులను బ్రహ్మాండంగా చేసి ఉంటే ఇప్పుడు ఈ పరిస్థితి ఎందుకు వచ్చేదన్నారు. గాంధీ ఆసుపత్రిలో ఎంతమంది చనిపోయారు? ఎవరి హయంలో ఎంతమంది రైతులు చనిపోయరు? లెక్కలు తీయాలన్నారు.

## నాకిష్టమైన పాత్ర అదే..

- హీరోయిన్ శ్రీలీల

**బలగం టీవీ , హైదరాబాద్**

టాలీవుడ్‌లో బిజీగా ఉన్న యంగ్ హీరోయిన్ శ్రీలీల. చిన్న వయసులోనే ఆమె స్టార్ హీరోల మూవీల్లో అవకాశాలు అందుకుంది. చివరిగా సూపర్ స్టార్ మహేశ్ బాబు సరసన 'గుంటూరు కారం'లో అలరించింది. ఇప్పుడు ఆమె చేతిలో కీలక ప్రాజెక్టులు ఉన్నాయి. అయితే ప్రొఫెషనల్‌గా తీరిక లేకుండా ఉన్నప్పటికీ సోషల్ మీడియాలో తన ఫాలోవర్లతో చిట్ చాట్ చేసేందుకు టైం కేటాయిస్తుంటుంది శ్రీలీల. ఈ భామ తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో క్వశ్చన్-ఆన్సర్స్ సెషన్‌లో పాల్గొన్నది. ఇందులో ఫాలోవర్స్ నుంచి ఆసక్తికరమైన ప్రశ్నలు ఎదురయ్యాయి. ఒకరు ఆమెను ఇప్పటి వరకు ఆమె చేసిన పాత్రల్లో ఫేవరెట్ ఏదని అడిగారు దీనికి శ్రీలీల స్పందిస్తూ సినిమా పేరు చెప్పకుండా.. ముఖంపై గాయమైన ఓ సినిమాలోని స్టిల్‌ను షేర్ చేస్తూ.. ఊహించండి అని సమాధానమిచ్చింది. ఇంకేంటి మరి ఫొటో రూపంలో హింట్ ఇచ్చేయడంతో.. ఈ స్టిల్ భగవంత్ కేసరి సినిమాలోనిదంటూ అప్పుడే క్లారిటీకి వచ్చేశారు మూవీ లవర్స్.




భగవంత్ కేసరిలో శ్రీలీల పోషించిన విజ్జి పాత్ర విమర్శకుల ప్రశంసలు అందుకుంది. ఇటీవలే సైమా అవార్డ్స్ 2024లో ఉత్తమ తెలుగు చిత్రంగా పురస్కారం కూడా అందుకుంది భగవంత్ కేసరి. శ్రీలీల ప్రస్తుతం నితిన్‌తో కలిసి రాబిన్ హుడ్, పవన్ కల్యాణ్ ఉస్తాద్ భగత్ సింగ్ చిత్రాల్లో నటిస్తోంది. వీటితోపాటు ఆర్‌టీ 75 ప్రాజెక్ట్‌లో ఫీ మేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది.



# సెంచరీ బాదిన అశ్విన్

- హెూం గ్రౌండ్‌లో అదరగొట్టిన ఆల్‌రౌండర్
- సెంచరీకి చెరువలో జడేజా
- జైస్వాల్ హాఫ్ సెంచరీ



బలగం టీవి, చెన్నై

భారత్ – బంగ్లాదేశ్ మధ్య జరుగుతున్న టెస్టు మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఆల్‌రౌండర్ అశ్విన్ శతకంతో అదరగొట్టాడు. తన హెూం గ్రౌండ్ అద్భుత ఇన్నింగ్స్ ఆడి లోకల్ ఫ్యాన్స్‌లో జోష్ నింపాడు. దాంతో తొలి రోజు ఆట ముగిసేసరికి భారత్ 339–6 స్కోర్ చేసింది.

అశ్విన్ శతకం (102 పరుగులు, 112 బంతుల్లో) అద్భుతమైన ఆటతో అదరగొట్టాడు. అతడు 108 బంతుల్లోనే సెంచరీ మార్క్ అందుకున్నాడు. ఇందులో 10 ఫోర్లు, 2 సిక్స్‌లు ఉన్నాయి. దీంతో అశ్విన్ తన అశ్విన్ టెస్టు కెరీర్‌లో 6వ శతకం పూర్తి చేశాడు. మరోవైపు జడేజా (86 పరుగులు నాటౌట్) కూడా బాధ్యాతాయుత ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. దాంతో, భారత్ తొలి రోజు ఆట ముగిసేసరికి 339–6 స్కోర్‌తో పటిష్ఠ స్థితికి చేరుకుంది. క్రీజులో అశ్విన్, జడేజా ఉన్నారు.

144 పరుగులకే 6 వికెట్లు కోల్పోయిన కష్టాల్లో పడ్డ టీమ్‌ఇండియాను జడేజా, అశ్విన్ ఆదుకున్నారు. వీరిద్దరూ 7వ వికెట్‌కు 195 పరుగులు అజేయ భాగస్వామ్యం నెలకొల్పి భారత్‌కు భారీ స్కోర్ అందించారు.

### టాపార్డర్ ఫెయిల్

ఎన్నో అంచనాలతో బరిలోకి దిగిన కెప్టెన్ రోహిత్ శర్మ (6), విరాట్ కోహ్లీ (6) విఫలమయ్యారు. యంగ్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ (0) కూడా పరుగుల ఖాతా తెరవకుండానే పెవిలియన్ చేరాడు. ఈ ముగ్గురిని 24ఏళ్ల పేసర్ మహ్మద్ హసన్ ఔట్ చేశాడు. దీంతో భారత్ 34 పరుగులకే టాపార్డర్ కుప్పకూలింది. ఈ దశలో ఓపెనర్ యశస్వీ జైస్వాల్ (56 పరుగులు) హాఫ్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. రిషబ్ పంత్ (39 పరుగులు)తో కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశాడు. ఇక కే ఎల్ రాహుల్ (16 పరుగులు) కూడా విఫలమయ్యాడు. బంగ్లాదేశ్ బౌలర్లలో హసన్ మహ్మద్ 4, నహీద్ రానా, మెహెదీ హసన్ మిరాజ్ తలో వికెట్ దక్కించుకున్నారు.

# నవంబర్‌లో ఐపీఎల్ మెగా వేలం..



బలగం టీవి, హైదరాబాద్

ఫ్రాంచైజీలతో పాటు అభిమానులు ఆసక్తిగా ఎదురు చూస్తున్న ఇండియన్ ప్రీమియర్ మెగా వేలం తేదీ ఫిక్స్ అయింది. వచ్చే నవంబర్ మూడో వారం లేదా నాలుగో వారంలో వేలం పాటను నిర్వహించేందుకు బీసీసీఐ సిద్ధమవుతోందని సమాచారం. అయితే.. ఈసారి కూడా విదేశాల్లోనే ఆక్షన్ నిర్వహిస్తారనే వార్తలు వినిపిస్తున్నాయి.అబుదాబీ, సౌదీ అరేబియాలో వేలం జరిపేందుకు బీసీసీఐ ఆసక్తి చూపిస్తున్నట్టు సమాచారం.ఐపీఎల్ వేలం నిర్వహణకు ఈ దేశాలు కూడా సుముఖంగా ఉన్నట్టు తెలుస్తోంది. అయితే.. అధికారిక ప్రకటన వస్తేగానీ తేదీ, వేదికపై పూర్తిగా స్పష్టత రానుంది.

గత పదేళ్లలో రెండు పర్యాయాలు ఐపీఎల్ అతిపెద్ద వేలంపాటలను నిర్వహించింది. మొదట 2014లో, ఆ తర్వాత 2018లో నిర్వహించింది. కరోనా కారణంగా 2021 మెగా వేలం వాయిదా పడింది. 2025 ఐపీఎల్‌కు సంబంధించి మెగా వేలానికి సంబంధించి మరో రెండు రోజుల్లో వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉందని బోర్డు వర్గాలు తెలిపాయి. త్వరలో జరగనున్న మెగా వేలం రెండు రోజుల పాటు నిర్వహిస్తారు.

ఐపీఎల్ మెగా వేలం తేదీ అయితే వచ్చింది గానీ.. రిటెన్షన్ విషయంపై ఇంకా ఊహాగానాలు కొనసాగుతూనే ఉన్నాయి. అయితే.. కనీసం ఈసారి 4 –5 మందిని అట్టిపెట్టుకునే అవకాశం ఇస్తారని ఫ్రాంచైజీలు భావిస్తున్నాయి. వేలం జరగడానికి ముందు అంటే.. నవంబర్‌లోనే రిటెన్షన్ పాలసీపై బీసీసీఐ ప్రకటన వెల్లడించే అవకాశం ఉందని తెలిసింది. ఇటీవలి ఐపీఎల్ పది జట్ల ఫ్రాంచైజీలతో జరిగిన పాలక మండలి సమావేశం పూర్తి కాలేదు. రిటెన్షన్ పై ఏకాభిప్రాయానికి రాలేదు. వేలానికి ముందు, ఫ్రాంచైజీలు గరిష్టంగా ఎంత మంది ప్లేయర్లను చేసుకోవచ్చు, విదేశీ ప్లేయర్లు ఎంత మంది ఉండాలి, ఇంపాక్ట్ రూల్ తదితర అంశాలపై చర్చలు జరిగినప్పటికీ, ఒక్కచోట ఒక నిర్ణయానికి రాకపోయింది.

ఇక వేలంలో అమ్ముడైన తర్వాత హ్యాండిచ్చిన విదేశీ ఆటగాళ్లపై రెండేండ్ల నిషేధంపై కూడా అప్పుడే క్లారిటీ రానుంది. హ్యారీ బ్రూక్ , మిచెల్ మార్ష్, జేసన్ రాయ్, ఆడం జంపా, మార్క్ వుడ్‌లు వంటి ఫారెన్ క్రికెటర్లు 17వ సీజన్ మినీ వేలంలో భారీ ధర పలికారు. కానీ, తీరా టోర్నీ ఆరంభానికి ముందు తాము రావడం లేదంటూ ఫ్రాంచైజీలకు షాకిచ్చారు. అందుకని వీళ్ల మళ్లీ వేలంలో పాల్గొనకుండా రెండేండ్లు నిషేధం విధించాలని పలు ఫ్రాంచైజీలు బీసీసీఐకి మొర పెట్టుకున్నట్టు తెలిసింది.

# దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్థాన్ చారిత్రక విజయం..



బలగం టీవి, హైదరాబాద్

దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్థాన్ చారిత్రక విజయం సాధించింది. యూఏఈ వేదికగా దక్షిణాఫ్రికాతో జరుగుతున్న మూడు వన్డే సిరీస్‌లో . షార్జా క్రికెట్ స్టేడియంలో బుధవారం జరిగిన తొలి వన్డేలో అఫ్గాన్ ఆరు వికెట్ల తేడాతో సౌతాఫ్రికాను ఓడించింది. దక్షిణాఫ్రికాపై అఫ్గానిస్థాన్‌కు ఇదే తొలి విజయం. ఈ సంచలన విజయంతో భారత్‌పై మినహా మిగిలిన పూర్తిస్థాయి సభ్య దేశాలపై అఫ్గాన్ గెలుపు రుచి చూసినట్టయింది.

టాస్ గెలిచి మొదట బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా.. అఫ్గాన్ బౌలర్ల ధాటికి 33.3 ఓవర్లలో 106 పరుగులకు ఆలౌట్ చేసింది. ఏ ఫార్మాట్‌లో అయినా దక్షిణాఫ్రికా జట్టును అఫ్గానిస్థాన్ ఆలౌట్ చేయడం ఇదే ప్రథమం. ఎడమచేతి వాటం పేసర్ ఫజల్లా ఫరూకీ, 18 ఏళ్ల కుర్రాడు అల్లా గజన్ఫర్ దాటికి పవర్‌ప్లేలోనే 36 పరుగులకు ఏడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో బ్యాటింగ్‌కు వచ్చిన వియాన్ ముల్డర్ (52, 84 బంతుల్లో, 5 ఫోర్లు, 1 సిక్సర్), జార్న్ ఫోర్టుయిన్ (16, 34 బంతుల్లో, 2 ఫోర్లు) ఇన్నింగ్స్ చక్కదిద్దే ప్రయత్నం చేశారు. వీరిద్దరు ఎనిమిదో వికెట్‌కు 39 పరుగులు జోడించారు. జోర్న్‌ను రషీద్ ఖాన్ ఔట్ చేసినప్పటికీ, బర్గర్ (1, 18 బంతుల్లో)తో కలిసి వియాన్ స్కోరుబోర్డును ముందుకు నడిపించాడు. వన్డేల్లో వియాన్ తొలి అర్ధశతకం సాధించడంతో పాటు జట్టు స్కోరు 100 పరుగులను దాటించాడు.

అనంతరం ఛేదనకు దిగిన అఫ్గానిస్థాన్ 26 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 107 పరుగులు చేసింది. అజ్మతుల్లా ఒమర్జాయ్ (25 నాటౌట్, 36 బంతుల్లో, 2 సిక్సర్లు), గుల్బాదిన్ నైబ్ (34 నాటౌట్, 27 బంతుల్లో, 3 ఫోర్లు, 2 సిక్సర్లు) జట్టును విజయతీరాలకు చేర్చారు. అయితే ఛేజింగ్‌లో ఓపెనర్ రహ్మనుల్లా గుర్బాజ్ ఎదుర్కొన్న మూడో బంతికే డకౌటయ్యాడు. కాసేపటికే వన్‌డౌన్‌లో వచ్చిన రహ్మత్ షా (8), మరో ఓపెనర్ రియాజ్ హసన్ (16) కూడా వెనుదిరగడంతో 38 పరుగులకే అఫ్గాన్ మూడు వికెట్లు కోల్పోయింది. అఫ్గాన్ కెప్టెన్ హస్మతుల్లా (16) కూడా స్వల్ప స్కోరుకే పెవిలియన్‌కు చేరాడు. అయితే అజ్మతుల్లా, గుల్బాదిన్ జాగ్రత్తగా ఆడుతూ సఫారీలకు ఛాన్స్ ఇవ్వలేదు. షార్జా వేదికగా శుక్రవారం రెండో వన్డే జరగనుంది.

# 'ఎమర్జెన్సీ'పై 25లో నిర్ణయం తీసుకోవాలి




బలగం టీవి, హైదరాబాద్

దివంగత ప్రధాని ఇందిరా గాంధీ జీవితం ఆధారంగా తెరకెక్కించిన ఎమర్జెన్సీ సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడానికి సీబీఎఫ్‌సీ నిరాకరించిన సంగతి తెలిసిందే. బాలీవుడ్ ప్రముఖ నటి, ఎంపీ కంగనా రనౌత్ నటించి, దర్శకత్వం వహించి, స్వయంగా నిర్మించిన చిత్రం 'ఎమర్జెన్సీ కాగా.. సీబీఎఫ్‌సీని ప్రశ్నిస్తూ కంగనా కోర్టును ఆశ్రయించింది.ఇప్పుడు ఎట్టకేలకు కోర్టు సీబీఎఫ్‌సీకి నోటీసులివ్వడంతో సినిమా త్వరలోనే విడుదలయ్యే అవకాశం ఉంది.

తన సినిమాకు సర్టిఫికెట్ ఇవ్వడంలో సీబీఎఫ్‌సీ జాప్యం చేస్తోందని, సీబీఎఫ్‌సీకి కోర్టు నోటీసులు జారీ చేయాలని నటి కంగనా రనౌత్ కోర్టును ఆశ్రయించారు. రెండు వారాల క్రితం విచారించిన బాంబే హైకోర్టు ఇదే అంశంపై ఇప్పటికే మధ్యప్రదేశ్ హైకోర్టు, సీబీఎఫ్‌సీకి నోటీసులు జారీ చేసింది కాబట్టి ఈ దశలో మేము (బాంబే హైకోర్టు) సీబీఎఫ్‌సీకి నోటీసు జారీ చేయలేం' అని కోర్టు ఇదివరకు చెప్పుకొచ్చింది. కానీ తాజా విచారణలో 'ఎమర్జెన్సీ' సినిమాకు సంబంధించి బాంబే హైకోర్టు సీబీఎఫ్‌సీకి నోటీసులు జారీ చేసింది. వారంలోగా అంటే సెప్టెంబర్ 25లోగా సినిమా సర్టిఫికెట్ విషయంలో నిర్ణయం తీసుకోవాలని సీబీఎఫ్‌సీకి సూచించింది. ఎమర్జెన్సీకి సర్టిఫికెట్ జారీ చేయడంపై సీబీఎఫ్‌సీ ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంపై జస్టిస్ బీపీ కొలబావాలా, జస్టిస్ ఫిర్దోష్ పూనివాలాలతో కూడిన ధర్మాసనం అసంతృప్తి వ్యక్తం చేసింది.

అలాగే, 'లా అండ్ ఆర్డర్ సమస్య గురించి ఆందోళన ఉన్నందున సృజనాత్మక స్వేచ్ఛ, భావప్రకటనా స్వేచ్ఛను హరించలేం. లా అండ్ ఆర్డర్ నేపథ్యంలో సెన్సార్ బోర్డ్ సినిమాకు సర్టిఫికేట్ ఇవ్వడానికి నిరాకరించదు' అని పేర్కొంది.

ధర్మాసనం మాట్లాడుతూ దేశ ప్రజలు సినిమాలో చూపించే ప్రతిదాన్ని నమ్మేంత అమాయకులని సీబీఎఫ్‌సీ భావిస్తుందా? అని సీబీఎఫ్‌సీని ప్రశ్నించింది. రాజకీయ కారణాలతో సినిమాకు సర్టిఫికెట్ జారీ చేయడంలో సీబీఎఫ్‌సీ జాప్యం చేస్తోందన్న పిటిషనర్ వాదనలపై.. చిత్ర సహ నిర్మాత కంగనా రనౌత్ స్వయంగా బీజేపీ ఎంపీ అని కోర్టు గుర్తు చేసింది. అధికార పార్టీ సొంత ఎంపీకి వ్యతిరేకంగా పని చేస్తుందా? అని ధర్మాసనం ప్రశ్నించింది.

'ఎమర్జెన్సీ' సినిమాలో ఇందిరాగాంధీ పాత్రలో కంగనా రనౌత్ నటించారని, రాజకీయ దురుద్దేశంతో సినిమా తీశారని ఆరోపణలు వచ్చాయి. కొన్ని పాత్రలను ఉద్దేశ్యపూర్వకంగా ట్విస్ట్ చేసి 'విలన్'లుగా చూపించారని గుసగుసలు వినిపిస్తున్నాయి. దీనికి తోడు, సిక్కు సంఘం ఈ సినిమాపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తం చేసింది. పంజాబీలను తక్కువ చేసి చూపించారని ఆరోపణలున్నాయి.


# నవంబర్ 14న 'కంగువా' విడుదల

బలగం టీవి, హైదరాబాద్



తమిళ స్టార్ హీరో సూర్య ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'కంగువా'. శివ దర్శకత్వం వహించారు. అక్టోబర్ 10న రిలీజ్ అవ్వాల్సిన ఈ చిత్రం కొన్ని కారణాల వల్ల వాయిదా పడింది. ఇప్పుడు తాజాగా ఈ మూవీ కొత్త రిలీజ్ డేట్‌ను చిత్ర బృందం ప్రకటించింది. నవంబర్ 14న ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయనున్నట్లు తెలిపింది. వాస్తవానికి అక్టోబర్ 10న కంగువాను రిలీజ్ చేయాలనుకున్నారు. . అయితే అదే రోజున రజనీకాంత్ నటించిన వేట్టయాన్ రిలీజ్ కానున్నట్లు మరో అనౌన్స్‌మెంట్ వచ్చింది. దాంతో సూర్య ఈ సినిమా వాయిదా గురించి వ్యాఖ్యలు చేశారు. "అక్టోబర్ 10న రజనీకాంత్ నటించిన వేట్టైయాన్ రిలీజ్ కానుంది. ఆ సినిమా విడుదలకు మనం దారి ఇవ్వాలి. రజనీ కాంత్ నాకు సీనియర్. నేను పుట్టే సమయానికే ఆయన యాక్టింగ్‌లోకి వచ్చేశారు. కాబట్టి ఆయన చిత్రమే ముందువస్తే బాగుంటుందని నా అభిప్రాయం" అని సూర్య అన్నారు.

# 23 నుంచి వీరమల్లు షూటింగ్



బలగం టీవి, హైదరాబాద్

ఏపీ డిప్యూటీ సీఎం, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ హీరోగా దర్శకుడు జ్యోతి కృష్ణ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం హరి హర వీరమల్లు.. అయితే ఈ సినిమా దాదాపు నాలుగేళ్ళ నుంచి షూటింగ్ దశలోనే ఉంది. తాజా అప్డేట్ ప్రకారం పవన్ కళ్యాణ్ ఈనెల 23 నుంచి వీరమల్లు సెట్స్‌లో జాయిన్ కానున్నట్లు తెలుస్తోంది. అలాగే అక్కడ నుంచి అక్టోబర్ 5 వరకు అలా వీరమల్లు షూటింగ్ ని కొనసాగిస్తాడని తెలిసింది. దీనితో పవన్ పోర్షన్ షూటింగ్ పూర్తవుతుందట. ఇక ఈ చిత్రంలో నిధి అగర్వాల్ హీరోయిన్‌గా నటిస్తుండగా ఎంఎం కీరవాణి సంగీతం అందిస్తున్నారు. మెగా సూర్య ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఏఎం రత్నం ఈ చిత్ర నిర్మాణం వహిస్తున్నారు.